## జాతీయ రహదారులతో వేగంగా ప్రగతి సాధిస్తాం..

**చించోలి హైవేతో హన్వాడకు మహర్దశ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్,అక్టోబర్,11,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధితోనే వేగంగా ప్రగతి సాధించ వచ్చని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జాతీయ రహదారులకు కేరాఫ్ అడ్రస్‌గా మారడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూటౌన్‌లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీలో టీఆర్ఎస్ పార్టీలో చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హన్వాడ మండలం కొనగట్టుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెన్నయ్యతో పాటుగా సుమారు 100 మంది బిజేపి, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు సర్పంచ్ బసిరెడ్డి అద్వర్యంలో మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. మహబూబ్‌నగర్ మండలం దర్మాపూర్ ఎంపిటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి అద్వర్యంలో ఊటకుంట గ్రామానాకా చెందిన వార్డు సభ్యుడు రఘురాములుతో పాటు 50 మంది కాంగ్రెస్, బిజేపి నాయకులు కార్యకర్తలు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కండువాలు వేసి స్వాగతించారు. పార్టీ నేతలు కరుణాకర్‌గౌడ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- **నిధులకు ఎలాంటి కొరత లేదు**
- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి**
- **రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 11 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం, అమ్మాపూర్ గ్రామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ సంవత్సరం అక్టోబర్ 26 నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని, ఇందుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ సమావేశ మందిరంలో కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఈ సంవత్సరం గత సంవత్సరం కన్నా బాగా నిర్వహించాలని, ఇందుకు నిధులకు ఎలాంటి కొరత లేదన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు, తాగునీటి సరఫరా, టాయిలెట్స్, విద్యుత్ సరఫరాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. ఈ సంవత్సరం ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసి ఎక్కువ బస్సులు నడపాలని, పార్కింగ్ వల్ల ఇబ్బందులు రాకుండా పార్కింగ్ కోసం ప్రత్యేకించి ప్రణాళిక రూపొందించాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లు ఏర్పాటు చేయాలని, మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్ శాఖ ద్వారా అవసరమైన బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయా లని చెప్పారు. ఇకపై ప్రతి సంవత్సరం ఇబ్బందులు పడకుండా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాలు నిర్వహించే ఉద్దాల ఉత్సవం రోజున కొండలలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా దూమ్‌లైట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, టాయిలెట్లు, తదితర వివరాలను తెలిపే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్అండ్‌బి ద్వారా బారికేడింగ్‌తో పాటు, అధికారులకు సౌకర్యంగా ఉండేలా షెడ్లు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపకశాఖ, ఫైర్ ఇంజన్‌తో పాటు, అవసరమైన సామాగ్రిని సిద్దంగా ఉంచాలని, పశు సంవర్ధకశాఖ ద్వారా అవసరమైన ఏర్పాటు చేయాలని చెప్పారు. గ్రామ పంచాయతీ నుండి పారి శుధ్య సిబ్బందితో పాటు, జిల్లాలోని మూడు మున్సిపాలిటీల నుండి కూడా వారి పారిశుధ్య సిబ్బంది ఏర్పాటు చేయాలని, 24 గంటలు విధులలో ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని చెప్పారు. మహబూబ్‌నగర్ - అమ్మాపూర్, కొత్తకోట - అమ్మాపూర్ రహదారులను ముందే తనిఖీ చేసి ఎక్కడైనా గుంతలు ఉన్నట్లయితే పూడ్చాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్పటిలాగే జిల్లా పరిషత్ నుండి జాతర పకడ్బందీగా నిర్వహించేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత కురుమూర్తి ఉత్సవాలలో భాగంగా 8వసారి ఉద్దాలఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆర్అండ్‌బి ద్వారా బారికేడింగ్‌తో పాటు, దేవరకద్ర ఆర్ఓబి ద్వారా ఉన్న సమస్యను తొలగించాలని, దీనికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా పుట్టపల్లి జంక్షన్ వద్ద రహదారిపై గుంతలు పూడ్చాలని, వర్నె దగ్గర రహదారి ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. గ్రామాల నుండి వచ్చే స్వచ్చంద సేవకుల సహాయం వినియోగించుకోవాలని, ఉద్దాల, అలంకరణ ఉత్సవాల రోజుతో పాటు, మరో రెండు రోజులు ఎక్కువ బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు సక్రమ నిర్వహణకు గత సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా పర్యవేక్షణ కమిటి, కో ఆర్డినేషన్ కమిటి, పారిశుద్ధ్య కమిటి, ఆహార కమిటి, ఆర్థిక కమిటి, ఫెస్టివల్ కమిటి, లా అండ్ ఆర్డర్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతసంవత్సరం పార్కింగ్ సమస్య ఉత్పన్నమైందని, ఈ సంవత్సరం అలా కాకుండా, పోలీస్, రెవెన్యూ, స్థానిక గ్రామ పంచాయతీ సహకారంతో పారి క్ంగ్ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీ నుండి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, దేవాలయ కురుమూర్తి స్వామి దేవాలయం కమిటి అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఏసీ శ్రీనివాసరాజు, చిన్నచింతకుంట మండల ఎంపిపి, ఇతర ప్రజాప్రతినిధులు, అదికారులు, సర్పంచ్‌లు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం

**మక్తల్,అక్టోబరు 11 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, డిసిసి అధ్యక్షులు వాకిటి శ్రీహరి అధ్యక్షతన పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానిక ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఏఐసిసి సెక్రెటరీ డా.జి. చిన్నారెడ్డి, ఎంపి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మల్లురవిలు హాజరయ్యారు. ముఖ్యంగా ఈనెల 23వ తేదీన రాహుల్‌గాంధి అచల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు భారత్ జోడో యాత్ర మన తెలంగాణ ప్రాంతంలో మక్తల్ నియోజకవర్గం, కృష్ణ మండలం, కృష్ణ బ్రిడ్జి దగ్గర నుండి పాదయాత్ర ప్రారంభవుతుందని తెలిపారు. ఈ పాదయాత్ర ఉదయం 7.30 గం.లకు ప్రారంభమై టై రోడ్డులో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాహుల్‌గాంధి తలపెట్టిన భారత్‌జోడో యాత్రకు సంబంధించి బహిరంగ సభకు 3 లక్షల జనాభాతో పెద్ద ఎత్తున స్వాగతం ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మక్తల్ నియోజకవర్గం 7 మండలాలకు సంబంధించిన మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ టౌన్ అధ్యక్షులు, వివిధ విభాగాలకు సంబంధించిన అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశానికి విచ్చేసిన అతిథుల ద్వారా భారత్ జోడోయాత్రకు సంబంధించి వివిధ అంశాల మీద ప్రతి ఒక్కరితో సలహాలు తీసుకోవడం జరిగింది. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, దేవరకద్ర నియోజకవర్గం నాయకులు జి. మధుసూదన్‌రెడ్డి, యువ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, మాజీ పిసిసి సమన్వయకర్త రాజుల ఆశిరెడ్డి, ఏడు మండలాల అధ్యక్షులు, ఎంపిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్ ఎంపిపిలు, కాంగ్రెస్‌పార్టీ వివిధ హోదాల్లో ఉన్నటువంటి ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.







వర్షపునీరు నిల్వ ఉండడంతో కిందపడ్డ మొక్కజొన్న పంట



కిందపడ్డ మొక్కజొన్న కంకులు మొలకలను చూపిస్తున్న దృశ్యం



# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## పొలాల్లో వర్షపు నీరు... రైతు కంట కన్నీరు..!

**-మొలకెత్తిన పత్తి, కిందపడ్డ మొక్కజొన్న పంటలు -పంట నష్టపోయి లబోదిబోమంటున్న రైతులు**



వర్షపునీరు నిల్వతో పత్తిపంటలో మొలకలు

**లింగాల,అక్టోబరు 11 ప్రభాతవార్త :** వానాకాలం సీజన్‌లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతన్న కంట కన్నీరు పెట్టిస్తున్నాయి. అధిక వర్షాల వల్ల పంట దెబ్బతిని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. వానాకాలం సీజన్‌లో జులై మొదలుకొని సెప్టెంబర్ వరకు అనేకసార్లు ముసురుతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. అక్టోబర్ నెలలో గతవారం రోజుల నుండి కురుస్తున్న వర్షాల ఫలితంగా మండలంలో ప్రధానంగా రైతులు సాగు చేసుకుంటున్న పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటలు దెబ్బతిని లక్షల్లో పంట నష్టం జరిగి రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షాల వల్ల పంట నష్టం వాటిల్లినప్పటికి ప్రభుత్వం నుండి ఎటువంటి నష్టపరిహారం అందకపోవడంతో రైతులు ఇక్కట్ల పాలవుతున్నారు. జులై మొదలుకొని కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు అధికంగా రావడంతో పత్తి ఊడలు నేలరాలి పత్తిలో మొలకలు రావడంతో రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. కోత దశలో ఉన్న మొక్కజొన్న పంటలో నీరుచేరి పంట కిందపడి విత్తనాలు మొలకెత్తుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాలకు పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను గ్రామాల వారిగా వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రతి సీజన్‌లో పంటలు నష్టపోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. వర్షాల వల్ల పంటలు నష్టపోతున్నప్పటికి ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందకపోవడంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు శంకర్, నరేష్ తదితరులు తెలిపారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటూ ప్రభుత్వం పరిహారం అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో అధిక వర్షాల వల్ల నష్టపోయిన వారి పంట వివరాలను గ్రామాల వారిగా ప్రభుత్వానికి అందిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ వానాకాలంలో మండలంలో పత్తి 6091 ఎకరాలు, మొక్కజొన్న 9398 ఎకరాలు, వరి 2495 ఎకరాలు ఇతర పంటలతో కలిపి మొత్తం 18,641 ఎకరాల్లో సాగు ఉందన్నారు. లింగాల మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 35 ఎకరాలలో పత్తిపంట నష్టం వాటిల్లిందని తెలిపారు. మొక్కజొన్న కూడా అక్కడక్కడ పడిపోయిందన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి పంట నష్టం నివేదిక పంపిస్తున్నామని అన్నారు. రైతులు ఇలాంటి పరిస్థితుల్లో పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చేసుకోవడమే కాకుండా, పలు జాగ్రత్తలు పాటించాలని ఎట నాగార్జునరెడ్డి తెలిపారు.

## శాటిలైట్ సర్వే ద్వారా సమస్య పరిష్కరిస్తాం..!

- **వచ్చే ఏడాది నాటికి లోతట్టు ప్రాంతాల్లో సమస్య లేకుండా చేస్తాం**
- **వర్ష వల్ల ఏర్పడిన నష్టాన్ని వివరించిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి**
- **తక్షణం రూ. 100 కోట్ల నిధుల విడుదల జిఓ జారీ**
- **కొత్త పింఛన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



లబ్దిదారులకు పింఛన్ కార్డులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 11 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ లోతట్టు ప్రాంతాల్లో శాటిలైట్ ద్వారా సర్వే చేయిస్తున్నామని, వర్షపునీటి ప్రవాహం సాఫీగా ఉండేలా యంత్రాంగం లెవల్స్ చెక్ చేస్తోందని, వచ్చే ఏడాది నాటికి లోతట్టు ప్రాంతాల్లో చిన్న సమస్య కూడా లేకుండా చేస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని భగీరథ కాలనీలోని పసుల కిష్టారెడ్డి గార్డెన్‌లో పాలకొండ, క్రిస్టియన్‌పల్లి, ఓల్డ్ పాలమూరు, బికె రెడ్డి కాలనీ, భగీరథ కాలనీలో 316 మందికి అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో హనుమాన్‌పుర, బండమీదిపల్లి, మేకల్‌బండ, రామయ్యబౌలి, గౌడ్స్ కాలనీ, హబీబ్‌నగర్, గణేష్‌నగర్‌లో 550 మందికి రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బోయపల్లి, న్యూమోతినగర్, ఓల్డ్ మోతినగర్, క్రిస్టియన్ కాలనీ, పాల్సాబ్‌గుట్టకు సంబంధించి 482 మంది లబ్దిదారులు కొత్త పింఛన్ కార్డుల పంపిణీ చేసే కార్యక్రమాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన లబ్దిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. 2014 ముందు మహబూబ్‌నగర్ పట్టణంలో సుమారు 9 వేల మందికి రూ. 31.76 లక్షల పింఛన్లు మాత్రమే వస్తే ఇప్పుడు 20 వేల మందికి నెలకు రూ. 4.24 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ. 407.07 కోట్ల పింఛన్లను అందించామని వెల్లడించారు. కొడుకులు, కూతుళ్ల సరిగా ఆదరించకపోయినా ఆసరా పింఛన్ల ద్వారా తమకు భరోసా లభించిందని వృద్ధులు సంతోషపడుతున్నారని తెలిపారు. ఆసరా పింఛన్లు తీసుకుంటున్న వృద్ధులందరికి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు శాంతనారాయణ గౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా మందులు, కంటి అద్దాలు కూడా ఇస్తామని మంత్రి వివరించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఇటీవలి భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పరిస్థితులను సీఎం కెసిఆర్ దృష్టికి తీసుకుపోగానే వెంటనే రూ. 100 కోట్ల నిధులను విడుదల చేస్తూ జిఓ జారీ చేశారని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజల సమస్యను వచ్చే ఏడాది నాటికి శాశ్వతంగా పరిష్కరిస్తామని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పెద్ద చెరువు 365 రోజులు నిండే ఉండేదని, ఎగువ నుంచి వచ్చిన వర్షం, మురుగునీరు వచ్చింది. వచ్చినట్లు కిందికి పోవడం తప్ప వేరే మార్గమే లేదన్నారు. లోతట్టు ప్రాంతాల సమస్య పరిష్కరించడమే కాకుండా ట్యాంక్‌బండ్, శిల్పారామం, ఐలాండ్, సస్పెన్షన్ బ్రిడ్జి ఏర్పాటుతో ఈ ప్రాంతానికి పర్యాటకులు పోటెత్తేలా చేస్తామని తెలిపారు. 2014కు ముందు కనీసం తాగునీరు కూడా వచ్చే పరిస్థితి ఉండేది కాదని మహబూబ్‌నగర్ పట్టణంలో నివసించేందుకు ఎవరు ఇష్టపడేవారు కాదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తాగునీటి కష్టాలతో పాటు అనేక సమస్యలను తీర్చామని తెలిపారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న స్థానికులు కూడా తిరిగి వచ్చి స్థానికంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. కేవలం 5 ఏళ్లలో లక్షల్లో ఉన్న భూముల విలువ కోట్లలోకి వచ్చిందని అన్నారు. భవిష్యత్తులో ఎవరూ ఊహించని స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కనీసం తాగునీళ్లు ఇవ్వని పార్టీలు, ఇవాళ కుల మతాల పేరిట చిచ్చురేపి అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తున్నాయని, వాళ్లను ప్రజలు గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, వైస్ ఛైర్మన్ గణేష్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రత్యర్థులుగా ఉండాలి కానీ శత్రువులుగా ఉండొద్దు

**-జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత ఎస్. జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఇతర మంత్రులు, అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 11 ప్రభాతవార్త :** ఎమర్జెన్సీలో జైలు జీవితంలో తన రాజకీయ జీవన గమనమే మారిపోయిందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. మహబూబనగర్ జిల్లా ధర్మాపూర్ వద్ద ఉన్న జెపిఎన్‌సి ఇంజనీరింగ్ కళాశాలలో సిల్వర్ జుబ్లి వేడుకలకు హాజరై మంత్రులు డా.వి. శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితో కలిసి ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత ఎస్. జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ 120వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ తాను, జైపాల్‌రెడ్డి ఇద్దరమూ జాతీయ వాదులమే అయినా సిద్దాంతపరంగా భిన్నమైన వాళ్లమని తెలిపారు. రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండలే తప్ప శత్రువులుగా ఉండొద్దన్నారు. చట్ట సభలో ఉన్నత ప్రమాణాలుండాలని తెలిపారు. డిక్సస్, డిబేట్, డిస్క్రైబ్ చేయాలని కాని డిస్టబ్ చేయకూడదన్నారు. రాజకీయాల్లో ఉన్నతమైన విలువలు, నీతి, నిజాయితీ అవసరమని వెంకయ్య పేర్కొన్నారు. చట్ట సభల్లో మాట్లాడండి, శాంతియుతంగా పోరాడండి, కానీ సభను జరగనివ్వండి, డెమొక్రసీని కాపాడండని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఓపిక ఉండాలని, కష్టపడితే, శ్రమిస్తే, పట్టుదల ఉన్నవారెవరైనా అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారని తెలిపారు. కలలు కనండి, కష్టపడండి, సాకారం చేసుకోండని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఇష్టపడి, కష్టపడితే భవిష్యత్తులో గొప్ప వాళ్లవుతారని తెలిపారు. మాతృభాషను మర్చిపోవద్దని, కన్నతల్లిని, జన్మభూమిని, మాతృదేశాన్ని మరిచినవాడు మానవుడే కాదని పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి అనర్గళమైన ఇంగ్లీష్ మాట్లాడేవారు, అయినా తెలుగులో మాట్లాడేందుకు ఇష్టపడేవారని గుర్తు చేశారు. జైపాల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని మాజీ ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

**జైపాల్‌రెడ్డి ఈ ప్రాంతానికి వన్నె తెచ్చారు**

**ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్**

చేసిన మేలు మర్చిపోకుండా మహనీయుడు జైపాల్‌రెడ్డిని స్మరించుకుంటూ కళాశాల ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి తమ కృతజ్ఞతను చాటుకోవడం గొప్ప విషయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఎస్. జైపాల్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచి ఈ ప్రాంతానికి వన్నె తెచ్చారని తెలిపారు. రాజకీయ కుటుంబం నేపథ్యం లేకపోయినా రాజకీయాల్లో అత్యుత్తమంగా రాణించారని తన తదనంతరం కుటుంబంలో ఎవరిని రాజకీయంగా ప్రోత్సహించలేదన్నారు. రాజకీయంగా వారసత్వాన్ని ప్రోత్సహించని గొప్ప వ్యక్తిత్వం ఆయనదన్నారు. విలువలతో రాజకీయ నాయకుడిగా జైపాల్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయాడన్నారు. ఉద్యమ సమయంలో ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి జైపాల్‌రెడ్డితో సమావేశం అయినట్లు ఉద్యమ ఆకాంక్షలు ఆయన దృష్టికి తీసుకుపోయినట్లు గుర్తు చేసుకున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కనీసం 5 టిఎంసిల నిల్వకూడా లేదని జైపాల్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా తెలంగాణ వారిని మభ్యపెట్టేందుకు ఇలాంటి వాటిని ప్రకటించి వదిలేస్తారని పేర్కొన్నారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా బ్రహ్మాండంగా ఆయకట్టు సాగుతున్నదని ఇప్పుడు ఆ మహానాడు ఉంటే ఎంతో సంతోషపడేవారని మంత్రి తెలిపారు.

**జయప్రకాష్ నారాయణ్ ఎందరినో ప్రభావితం చేశారు**

**వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి**

లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ వ్యక్తిత్వం, సామీప్యతతో ప్రభావితులైన వారు ఎంతో మంది ఉన్నారని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచాన్ని అధ్యయనం చేసిన యువ మేధావిగా స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించి, రాజకీయ పదవులకు దూరంగా ఉండి దేశం బాగుండాలని భావించిన మహనీయుడు జయప్రకాష్ నారాయణ్ అని పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు విలక్షణమైన, ప్రతిభాశీలమైన, ప్రభావ శీలమైన వ్యక్తిత్వం కలిగిన సమకాలికులని తెలిపారు. దివంగత జైపాల్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఇద్దరు తెలుగు జాతి ఖ్యాతిని పెంచారన్నారు. అనంతరం జయప్రకాష్ నారాయణ్ 120వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, దివంగత జైపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి జైపాల్‌రెడ్డి, పద్మారెడ్డి, జెపిఎన్‌సిఈ ఛైర్మన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోయిల్‌సాగర్‌కు తగ్గుముఖం పట్టిన వరద..

## క్షేత్ర పరిశీలన చేసిన డీఆర్డీఓ..

**పెబ్బేర్‌రూరల్, అక్టోబర్11 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల పరిధిలోని రంగాపుర్ గ్రామంలో జిల్లా డీఆర్డీఓ అధికారి నర్సింహులు పలు అభివృద్ధి పనులను తనిఖీ చేసి క్షేత్రస్థాయి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యాస రచన పోటీలను పరిశీలించారు. అనంతరం మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగం గా నిర్మిస్తున్న పాఠశాల నిర్మాణాలను వెంట నే పూర్తి చేయాలని ఆదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో హరితహారం మొక్కలను పరిశీలించారు. తదుపరి అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండలం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, రంగాపూర్ సర్పంచ్ గట్టయ్య, ఉపాధిహామి ఏపీఓ, రంగా పూర్, సూగూర్ పంచాయితీ కార్యదర్శుఉలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## మామిడిలో వచ్చే పురుగులను రసాయనిక పురుగు మందులతో తొలగించండి:కె.వి.శాస్త్రవేత్త సురేష్

**వీపనగండ్ల, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** మామిడి తోటలో వ్యాపించే చీడపురుగులు మరియు గూడు కట్టుకొని ఉండే వాటికోసం వివిధ రకాలైన టువంటి మం దులను రైతులు వాడి నష్ట పోవద్దని కెవికె మదనాపురం శాస్త్ర వేత్త ఉద్యాన నిపుణులు కె.సురేష్ కు మారన తెలిపారు. ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రెస్ మీట్‌లో ఈ క్రింద తెలిపిన పురుగు మందులను వాడితే రైతులకు మేలు జరుగుతుం దని గూడు పురుగులను డిస్టర్బ్ చేయాలి అని తెలిపారు. ఈ గూడు కట్టుకొని ఆకు మీద చుట్టుగా పురుగులు ఉంటాయని వాటిని తొల గించడం కోసం 200లీటర్ల నీటికి సైన్‌గెంట పాలిట్రిన్ 500 ఎమ్ఎల్ లేదా క్లోరోపైరిపాస్ 50% సిప్రెమెట్రిన్ 50%ఈసీ 500ఎమ్ఎల్ లేదా లాండాసైహాలోట్రిన్ 400ఎమ్ఎల్ కలిపి చెట్టంత తడి చేట్లుగా పిచికారి చేయాలని అని ఆయన సూచించారు. రైతులు వివిధ రాకలైనటువంటి పురుగు మందులను ప్రస్తుత దేశంలో వాడవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు.



## అంత్యక్రియలకు అభిమన్యురెడ్డి ఆర్థిక సహాయం

**రాజాపూర్, అక్టోబరు 11 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో అల్లె రాములమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఈ విషయాన్ని టిఆర్ఎస్ పా ర్టీ యువనేత చించోడ్ అభిమన్యురెడ్డికి తెలియజేయగా వెంటనే స్పందించి సంతాపా న్ని ప్రకటించి, అంత్యక్రియల కు రూ.5వేల ఆర్థిక సహాయా న్ని యువసేన నాయకుల ద్వారా అందించడం జరిగిం ది. కార్యక్రమంలో మాజీ ఎంపిపి, రైతు సమన్వయ స మితి మండల అధ్యక్షులు హ న్మగళ్ల నర్సింహులు, టిఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వనపర్తి నరహరి, బొడ రాములు, అభిమ న్యు యువసేన ఉపాధ్యక్షుడు సున్నపు శ్రీనివాస్, విజయ్, నజీమ్, నవీన్, కొంగళ్ల శ్రీనివాస్, కడల రవి, పాల్కొండ జంగయ్య, సిందం ప్రశాంత్, గజ్జి లింగం, అల్లెరాజు, కడల యాదయ్య, అల్లె యాదయ్య, గ్రామస్తులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ ఓటర్ ఎన్రాల్మెంట్ చేసుకోండి..

**గోపాల్‌పేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఓటర్ ఎన్రాల్మెంటన చేసుకోవాలని. టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎండి అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలు, కాలేజీలను యూటీఎఫ్ బృందం సందర్శించి రాబోయే హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయుల ఎమ్ఎల్‌సీగా మానిక్‌రెడ్డి ని గెలిపించి విద్యా వ్యవస్థను పటిష్టపరచాలని ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడాలని ఆయన కోరారు. 8సంవత్సరాల నుండి పదోన్నతులు లేవని, బదిలీలు లేవని, పాఠశాల విద్యారంగా పర్యవేక్షణ అధికారులు లేక కోనారిల్లుతుంది కనుక ఉపాధ్యాయులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని అహ్మద్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యయ అధ్యక్షుడు గంగన్న, ప్రధాన కార్యదర్శి సూరయ్య, లెక్చరర్ శేషయ్య ఉన్నారు.

## హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా పసుపుల రాము నియామకం

**తెల్కపల్లి, అక్టోబరు11 ప్రభాతవార్త:** హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఎజిపి)గా పసుపుల రామును నియమిస్తూ సోమవారం న్యాయశాఖ కార్యదర్శి నర్సింగరావు ఉత్తర్వులు జారీ చేశారు. తెల్కపల్లి మండల కేంద్రానికి చెందిన పసుపుల చింతల్, చిన్నమ్మల కుమారుడు రాము హైకోర్టులో ఎనిమిదేళ్లుగా న్యాయవాదిగా పని చేస్తున్నా రు. ఇతని క్రమశిక్షణను గుర్తించిన న్యాయశాఖ అనతి కాలం లోనే అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకం చేసింది. చదువుతున్న రోజుల్లోనే తెలంగాణ ఉద్యమాలలో క్రియాశీలకం గా కొనసాగుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యార్థి జెఏసి జిల్లా సమన్వయకర్తగా పని చేశారు. మొదటి నుండే చ దువు పట్ల ఎంతోఆసక్తితో 2015 సంవత్సరంలో న్యాయ విద్య పూర్తిచేసి తెలంగాణ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని హైకోర్టులో ప్రాక్టీస్ మదలు పెట్టారు. ఈ సందర్భంగా ఎజిపిగా నియామకం కావడంతో స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, తెల్కపల్లి మండల ప్రజలు, నాయకులు, బంధుమిత్రులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.



## 12 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత కేసు నమోదు..

**పానగల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాయినిపల్లి గ్రామ శివారులో అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్న పానగల్ ఎస్ఐ నాగన్న తెలిపారు. ఉస్ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మహ్మదాపూర్ గ్రామానికి చెందిన ఎరుకలి నరసింహ అనే వ్యక్తి మహ్మదాపూర్ నుంచి రాయిపల్లి గ్రామం మీదుగా బొలెరో వాహనంలో బియ్యం ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని వెంటనే బొలెరో వాహనాన్ని పానగల్ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని తెలిపారు. అనంతరం సరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంబందిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంబందిత శాఖ డిప్యూటి తహసిల్దార్ నందకిషోర్ పానగల్ పోలీస్ స్టేషన్ కు చేరుకొని పట్టుబడ్డ బియ్యాన్ని పరిశీలించి 12 క్వింటాళ్ల రేషన్ బియ్యంగా గుర్తించారని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ డీటీ నందకిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహ్మదాపూర్ గ్రామానికి చెందిన నరసింహాపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మహ్మదాపూర్ గ్రామానికి చెందిన నరసింహ అక్రమ రేషన్ బియ్యం తరలిస్తూ నెల రోజుల్లో మూడు సార్లు పట్టుబడడం విశేషం.



## మృతురాలి కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందించిన ఛైర్మన్

**భూత్పూర్, అక్టోబరు 11 ప్రభాతవార్త :** పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన టిఆర్ఎస్ కార్యకర్త ఖయ్యూమ్ భార్య శహనాజ్ మంగళవారం మృతి చెందినందున మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ మృతురాలి ఇంటికి హుటాహుటిన వెళ్లి తీవ్ర సంతాపం తెలపడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు. పార్టీ మరో సీనియర్ నేత తోక మురళీధర్‌గౌడ్ సంతాపం తెలపడంతో పాటు తనవంతు సహాయంగా రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం రాములు, గడ్డం యాదయ్య, గడ్డం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బాలికల దినోత్సవం...

**కల్వకుర్తి, అక్టోబర్ 11, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బేటి బచావో బేటీ పడావో అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి బాలల పరిరక్షణ విభాగం అధికారి టీ.శ్రీశైలంగౌడ్, మధుబాబులు ముఖ్య అతిథులుగా హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివి ఉన్నత అంశాలపై సమాజంలో ఉండేటటువంటి సామాజిక నిర్మత గురించి, బాలికలు సమ సమాజాభివృద్ధిలో పాలు పంచుకొవాలన్నారు. తమ జీవితాన్ని సక్రమమైన మార్గంలో నడుచుకునే విధంగా మరియు బాలిక చట్టాలపై అవగాహన కార్యక్రమంపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.



- 2 షెట్టర్లు తెరచి దిగువకు నీటి విడుదల
- శాంతించిన కోయిలకొండ,అంకిళ్ళ వాగుల ఉధృతి
- 32.2 ఫీట్లకు తగ్గిన నిటినిల్వ
- కుడి,ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు కొనసాగుతున్న నీటి సరఫరా

**దేవరకద్ర రూరల్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌కు మంగళవారం వరద ఉధృతి బాగా తగ్గింది. దీంతో కేవలం ప్రాజెక్టు 2 షెట్టర్లను మాత్రమే ఫీటున్నర ఎత్తు తెరచి దిగువకు నీటిని విడుదల చేశారు. వరద నీరు గణనీయంగా ప్రాజెక్టులోని వచ్చి చేరుతుండటంతో అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. గత నాలుగు రోజులుగా ప్రాజెక్టులోని వచ్చి చేరే నీటి ఉధృతి హెచ్చుతగ్గులుగా ఉంటుంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు 32.2 ఫీట్లకు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి వచ్చి చేరే అంకిళ్ళ,కోయిలకొండ పెద్దవాగుల నుండి నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరడం బాగా తగ్గింది. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వచ్చింది. జలసవ్వడి చూపరులను మంత్రముగ్దులను చేస్తుంది. ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుంది. ప్రాజెక్టులో కనుచూపు మేర నీరే కనిపిస్తుంది. ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో నీరు వచ్చి చేరిందని తెలుసుకొన్న పర్యాటకులు ప్రాజెక్టును చూడటానికి అధికసంఖ్యలో కోయిల్‌సాగర్‌ను చూడటానికి తరలివస్తున్నారు.

**ఆయకట్టుకు కొనసాగుతున్న నీటి సరఫరా..**

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి,ఎడమ కాలువల ద్వారా గత కొన్ని రోజులుగా ఆయట్టుకు నీటి సరఫరా కొనసాగుతూనె ఉంది. ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో ఆయకుట్టకు నీటి సరఫరాను అలాగే కొనసాగిస్తున్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు షెట్టర్‌ను తెరువడంతో బండర్‌పల్లి వాగు ఉధృతి కొనసాగుతుంది.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు 2 షెట్టర్లను తెరచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

## చట్టాల అమలుతోనే మహిళలకు భద్రత..

**వనపర్తి న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఉత్తరయ్య**

**వనపర్తి టౌన్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** మహిళలు, బాలికలకు ఉద్దేశించిన చట్టాల అమలుతోనే సమసమాజం ఏర్పడుతుందని వనపర్తి న్యాయవాదుల సంఘం కార్యదర్శి జి.ఉత్తరయ్య అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా దికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాలికల దినం పురస్కరించుకొని విద్యా ర్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఉత్తరయ్య మాట్లాడుతూ స్త్రీల కోసం ఎన్నో చట్టాలు రూపుదిద్దుకున్నాయని వాటిని అవగాహన చేసుకొని వినియోగించుకుంటే మహిళలకు సమాజంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరింపబడుతాయని అన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా సచ కేంద్రాలు బాలల సంరక్షణ కమిటీలు, షీ టీమ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. బాలికల వేదింపుల నివారణకు అఘాయిత్యాలను రూపుమాపేందుకు పీఓసీఎస్ఓ చట్టం ఏర్పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దేగల కృష్ణయ్య, వినోద్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, లోకాలదాత్ సిబ్బంది, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది ఉత్తరయ్య

## బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

**-లక్ష్మీపల్లి సర్పంచ్ కృష్ణారెడ్డి -ఘనంగా ప్రపంచ బాలికల దినోత్సవ వేడుకలు**

**దేవరకద్రరూరల్, అక్టోబరు11 ప్రభాతవార్త:** బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని లక్ష్మీపల్లి సర్పంచ్ కృష్ణారెడ్డి అన్నారు. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం ప్రపంచ బాలికల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి ముఖ్యఅథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో మగపిల్లలు, ఆగపిల్లలు సమానమన్నారు. ఆడపిల్లల పట్ల ఎవరూ కూడ వివక్ష చూపరాదన్నారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక విద్యా పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు వారిని అన్ని విధాల ప్రోత్సాహం కూడ అందిస్తుందన్నారు. అట్టి పథకాలను బాలికలు సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలన్నారు. అలాగే ఉన్నత చదువులు చదివి గొప్ప పదవులను అధిరోహించాలన్నారు.

**ఏకరూప దుస్తుల పంపిణీ..** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలలో మంగళవారం బాలికలకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశా రు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో బాలికలకు ఉచితంగా ఈ దుస్తులను పంపిణీ చేయ డం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, బాసిద్, కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు, లక్ష్మి, పాండమ్మ, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపల్లిలో ఏకరూపదుస్తులు అందుకొన్న విధ్యార్థులతో ఉపాధ్యాయులు

## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

**-నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నారాయణపేట, అక్టోబరు 11 ప్రభాతవార్త :** ఈనెల 16న నారాయణపేట జిల్లాలో జరిగే గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలో 7 పరీక్ష కేంద్రాల్లో 2184 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు సిద్ధం చేస్తున్నామని పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఫర్నీచర్, ఫ్యాన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా ప్రత్యేకంగా బస్సులను నడిపేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు ప్రతి పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 10 గం.లకు జరిగే పరీక్షకు పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు 8.30 గం.ల వరకు చేరుకోవాలని సూచించారు. ఈసారి ప్రత్యేకంగా బయోమెట్రిక్ విధానం చేసినందున పరీక్షలు రాసే అభ్యర్థులు 8.30 గం.లకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ప్రారంభమయ్యే సమయాని కంటే 15 నిమిషాలు ముందుగానే గేట్లు మూసివేయబడుతుందని అభ్యర్థులు గమనించాల్సిందని సూచించారు. పరీక్షలు రాసే అభ్యర్థుల హాల్ టికెట్‌లపై ఫొటో ప్రింట్ లేకపోతే హాల్ టికెట్‌పై ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో ధృవీకరణ చేయించుకోవలసి ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు బంగారు ఆభరణాలతో పాటు బూట్లు, సాక్స్ ధరించి పరీక్ష కేంద్రాలకు రాకూడదన్న నిబంధన ఉన్నందున ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. బ్లూ లేదా బ్లాక్ బాల్‌పెన్లు మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. ఓఎంఆర్ షీట్‌పై ఎలాంటి కొట్టివేతలు దిద్దడాలు, వైట్‌నర్లు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం





మాట్లాడుతున్న బాలల సంక్షేమ కమిటి సభ్యులు విష్ణు , హాజరైన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు

**తెల్కపల్లి, అక్టోబరు 11 ప్రభాతవార్త :** జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలోని తెల్కపల్లి స్థానిక జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలల దినోత్సవ సంబరాలు జరుపుకోవడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాలల సంక్షేమ కమిటి సభ్యులు విష్ణు మాట్లాడుతూ బాలికలందరు తమ తమ హక్కులలో సమానత్వం సాధించాలని, మీరందరు లింగ వివక్ష గురి కావద్దని తెలిపారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం 2012 అక్టోబర్ 11న సంవత్సరం నుంచి జరుపుకుంటున్నామని అదేవిధంగా బాలల హక్కుల గురించి వివరించడం జరిగింది. ఈ సంవత్సరం థీమ్ ఈ సమయం మాది మా హక్కులు మా భవిష్యత్తుకై అని తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా మన జిల్లాలో ప్రస్తుతం బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని అదేవిధంగా లైంగిక వేధింపులు వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బాలస్వామి, జయమ్మ, ఉపాధ్యాయురాలు వేదవతి, ఉపాధ్యాయురాలు జిల్లా ప్రొటెక్షన్ అధికారి సుదర్శన్, సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడి టీచర్ చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## మండల సీఐటీయు నూతన కమిటీ ఎన్నిక..

**అమరచింత, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** అమరచింత మండల సీఐటీయు 3వ మహాసభలో భాగంగా మంగళవారం సీఐటీయు నూతన కమిటీని ప్రకటించారు. సీఐటీయు మండల కమిటీ కన్వీనర్‌గా ఆర్.ఎన్ రమేష్, కో కన్వీనర్ బుచ్చన్న, ఎం.ప్రభాకర్, ఎం.నాగేంద్రమ్మ, శాంతమ్మ, పి.వెంకటేష్, డి.నరసింహ్మా వీరితో పాటు సీఐటీయు మండల కమిటీ సభ్యులుగా 15మందిని ఎన్నుకున్నారని కన్వీనర్ ఆర్.ఎన్.రమేష్ తెలిపారు.



## బాలిక బంగారు భవిష్యత్తుకు తోడ్పాటునివ్వండి

**మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్**



**భూత్పూర్, అక్టోబరు11 ప్రభాతవార్త :** బాలికల బంగారు భవిష్యత్తుకు ప్రతి తల్లిదండ్రులు పాటుపడాలని భూత్పూర్ మున్సిపల్ ఛైర్మన్ నూరుల్ నజీబ్ పిలుపునిచ్చారు. మంగళవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాఠశాలల బాలికలు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం భూత్పూర్ జాతీయ రహదారి కూడలిలో ఏర్పాటైన సమావేశంలో కమిషన్ మాట్లాడుతూ బాలికలు దేశానికి ఎంతో దోహదపడుతున్నారన్నారు. బాలిక విద్య దేశ ప్రగతికి మూలమన్నారు. జిల్లా సాంస్కృతిక శాఖ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## మరణం లేని నాయకుడు తిరుపతయ్య

**మాజీ ఎంపిపి నర్సింలు**



**రాజాపూర్, అక్టోబరు11 ప్రభాతవార్త:** మండలకేంద్రానికి చెందిన బిజెపి నాయకులు స్వర్గీయ మల్లెపాగతిరుపతయ్య మరణంలేని నా యకుడని, మాజీఎంపిపి రైతుబంధు మండల అధ్యక్షులు హన్మగళ్ల నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని రాజాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర పలువురు తిరుపతయ్యచిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వఆసుపత్రిలో బిజెవైఎం మండలఅధ్యక్షుడు ఆదిత్య ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## వీఆర్ఏ ల ముందస్తు అరెస్టు..



**పానగల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** వీఆర్ఏ ల సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని సుందరయ్య పార్క్‌లో మహిళ వీఆర్ఏ ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి పానగల్ మండలంలోని గ్రామాల వీఆర్ఏ లు హాజరుకాకుండా పానగల్ ఎస్ఐ నాగన్న ఆధ్వర్యంలో మండలంలోని వీఆర్ఏ లను తెల్లవారుజామున ముందస్తు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. హైదరాబాద్ లోని సుందరయ్య పార్క్‌లో మహిళా వీఆర్ఏ ల ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేయాలని రాష్ట్ర జేఏసీ పిలుపునిచ్చిందని పానగల్ మండలంలో మాత్రం పురుష వీఆర్ఏ లను అందరిని అరెస్టు చేయడం పద్ధతి కాదని వీఆర్ఏ లు ఆవేదన వ్యక్తం చేశారు.

## టీఆర్ఎస్వీ విస్తృత స్థాయి సమావేశానికి తరలివెళ్లిన నాయకులు

**వెల్దండ, అక్టోబర్ 11, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన టీఆర్ఎస్వీ విస్తృత స్థాయి సమావేశానికి యువజన విభాగం మండల అధ్యక్షులు జంగిలి యాదగిరితో పాటు పలువురు బయలుదేరారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ దేశంలోనే కనివిని ఎరుగని పథకాలు సీఎం కేసీఆర్ అమలు చేసి దిగ్విజయంగా అమలు చేస్తున్నారన్నారు. వారి నాయకత్వాన్ని దేశ ప్రజలందరు కోరుకుంటున్నారన్నారు. తరలివెళ్లిన వారిలో బాలకృష్ణ, పిల్లి దేవేందర్, రమేష్‌గౌడ్, రవిగౌడ్, చంద్రశేఖర్, మహేష్ తదితరులు ఉన్నారు.



